క్లుప్తంగా

500 మందికి వైద్య సేవలు



రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

నెల్లిమర్ల రూరల్: నగర పంచాయతీ పరిధిలోని ఆదిత్య పాఠశాలలో గురువారం నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. రోటరీ క్లబ్, చిన్నమాంబ సేవా సంఘం ఆధ్వర్యంలో జరిగిన వైద్య శిబిరంలో సుమారు ఐదు వందల మందికి వైద్యసేవలు అందజేశారు. పలువురిని వైఎస్సార్ ఆరోగ్యశ్రీ ట్రస్ట్ ద్వారా ఉచిత శస్త్ర చికిత్సలకు ఎంపిక చేశారు. కార్యక్రమంలో వైద్యులు సంతోష్, శ్రవణ్, రాజశేఖర్, గోవింద, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకోవాలి



హెచ్‌డీటీకి వినతిపత్రం అందిస్తున్న శంకరరావు, తదితరులు

విజయనగరం రూరల్: విజయనగరం కార్పొరేషన్ పరిధి ఒకటో డివిజన్‌లో సర్వే నంబర్ 136లో జరిగిన గెడ్డ ఆక్రమణపై చర్యలు తీసుకోవాలని పట్టణ పౌర సంక్షేమ సంఘ కార్యదర్శి రెడ్డి శంకరరావు డిమాండ్ చేశారు. గెడ్డకు సంబంధించిన సుమారు 10 సెంట్ల ప్రభుత్వ స్థలాన్ని కొంతమంది పదేళ్ల కిందటే ఆక్రమించారని, అయినా రెవెన్యూ అధికారులు చర్యలు తీసుకోలేదన్నారు. వెంటనే సర్వే చేపట్టి ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకోవాలని కోరుతూ హెచ్‌డీటీ కోటీశ్వరుడికి గురువారం వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో పట్టణ పౌర సంక్షేమ సంఘ సభ్యులు పాల్గొన్నారు.

చోడిపంట సాగును ప్రోత్సహించండి



కౌలు రైతుకు గుర్తింపు(సీసీఆర్‌సీ) కార్డు అందజేస్తున్న జేసీ మయూర్ అశోక్

బొండపల్లి: మెట్ట భూముల్లో చోడి (రాగులు) పంటను సాగుచేసే విధంగా రైతులను ప్రోత్సహించాలని జేసీ కె.మయూర్ అశోక్ సూచించారు. స్థానిక రైతు భరోసా కేంద్రం(ఆర్బీకే)లో గురువారం ఆయన తనిఖీలు చేశారు. రికార్డులను పరిశీలించి, సిబ్బందికి పలు సూచనలు చేశారు. పలువురు కౌలు రైతులకు సీసీఆర్‌సీ (క్రాప్ కల్టివేటెడ్ రైట్స్ కార్డు)లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ ఆర్బీకేలో ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి ఎరువులను అందుబాటులో ఉంచాలని, ఎరువుల స్టాకు వివరాలను పరిశీలించాలని వ్యవసాయ శాఖ అధికారులకు సూచించా రు. అలాగే పీఎం కిసాన్‌కు సంబంధించి ఇంకా ఈకేవైసీ చేయించుకోని రైతులతో త్వరగా ఈకేవైసీ చేయించే విధంగా చర్యలు తీసుకోవాలని అన్నారు. ఇంకా గ్రామాల్లో అర్హత ఉన్న కౌలు రైతులను గుర్తించి వారందరికీ కౌలు గుర్తింపు(సీసీఆర్‌సీ) కార్డులు అందజే యాలని అధికారులకు సూచించారు. గజపతినగరం సబ్ డివిజన్ ఏడీఏ కె.హమరాజన్, ఏఓ పి.వి. మల్లికార్జు నరావు, బొండపల్లి ఉప సర్పంచ్ కోళ్ల వెంకటరమణ, ఎంపీటీసీ బండారు శ్రీను తదితరులు పాల్గొన్నారు.

నాడు- నేడు పనులను త్వరగా పూర్తి చేయాలి

- అధికారులకు కలెక్టర్ నాగలక్ష్మి ఆదేశం



గరుగుబిల్లిఉన్నత పాఠశాలలో నాడు-నేడు పనులను పరిశీలిస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి

మెరకముడిదాం: పాఠశాలల్లో నాడు-నేడు పనులను త్వరితగతిన పూర్తిచేయాలని జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి అధికారులను ఆదేశించారు. మండలంలో గురువారం ఆమె పర్యటించారు. ముందు గా గరుగుబిల్లి ఉన్నత పాఠశాలను సందర్శించి, నాడు-నేడులో భాగంగా పాఠశాలల్లో చేపడుతున్న మరుగుదొడ్లు, అదనపు తరగతి భవనాల నిర్మాణాలను పరిశీలించారు. పనులకు ఎంత నిధులు మంజూరయ్యాయని సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్‌ను అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో మధ్యాహ్న భోజనం వంటకాలను పరిశీలించారు. రాగిజావతో పాటు, పులిహోరా ను రుచి చూశారు. 10వ తరగతి విద్యార్థుల విద్యాసామర్థ్యాన్ని పరీక్షించారు. అనంతరం సాతాంవలస ఉన్నత పాఠశాలలో నాడు-నేడు పనులను పరిశీలించారు. అక్కడి నుంచి మెరకము డిదాం తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లి రెవెన్యూ అధికారులతో సమగ్రభూరీసర్వేపై సమీక్ష నిర్వహించారు. మండలంలో భూరీసర్వేను త్వరగా పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం బుధరాయవలసలో నిర్వహిస్తున్న 'ఫ్యామిలీ డాక్టర్' కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

ఉత్తమ సేవలందించేందుకే 'జగనన్న సురక్ష'

- కార్పొరేషన్ కమిషనర్ రెడ్డి శ్రీరాములనాయుడు



విజయగనరం: లబ్ధిదారులకు ధ్రువపత్రాలు అందజేస్తున్న అధికారులు

విజయగనరం: ప్రజలకు మరింత ఉత్తమమైన సేవలు అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం జగనన్న సురక్ష కార్యక్రమం చేపడుతోందని విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్ కమీషనర్ రెడ్డి శ్రీరాముల నాయుడు స్పష్టం చేశారు. నగరంలోని 20, 21, 22, 23, 24 డివిజన్‌లకు సంబంధించి ఆయా సచివాలయాల పరిధిలో జగనన్న సురక్ష కార్యక్రమాలు నిర్వహించి 2,534 మందికి వివిధ రకాల ధ్రువపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశాల్లో కమిషనర్ ఆర్. శ్రీరాములనాయుడు మాట్లాడుతూ, ప్రజలకు అవసరమైన 11 రకాల ధ్రువపత్రాలను సులభతర రీతిలో పూర్తి ఉచితంగా ప్రభుత్వం అందజేస్తోందన్నారు. ఈ బృహత్తర కార్యక్రమానికి ప్రజల స్పందన అనూహ్యంగా లభించడం శుభ పరిణామమని చెప్పారు. ఇప్పటికే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా ప్రజా సమస్యలను తెలుసుకుంటూ వాటి పరిష్కారానికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్లు తెలిపారు. వలంటీర్ వ్యవస్థ ద్వారా ప్రభుత్వ సేవలు మరింత అందుబాటులోకి వచ్చాయన్న అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఆయా డివిజన్ల కార్పొరేటర్లు బవిరెడ్డి సతీష్, పిల్ల రాధాభవానీ, కంటుభుక్త తవిటిరాజు, కనకల నాగవల్లి, వైఎస్సార్ సీపీ నాయకులు కేదారశెట్టి లక్ష్మణరావు, రామేశ్వరపు రామారావు, కనకల గిరి, అవినాపు లక్ష్మణరావు, ఏసీపీలు మధుసూదనరావు, అమ్మాజీరావు, కార్పొరేషన్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

సద్వినియోగం చేసుకోవాలి

పూసపాటిరేగ: జగనన్న సురక్ష పథకాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ ఇ. భాస్కరరావు, ఎంపీడీఓ జి. రామారావు అన్నారు. మండలంలోని కుమిలి-2, తిప్పలవలస సచివాలయం పరిధిలో జగనన్న సురక్ష శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఆయా సచివాలయ పరిధిలో 1102 మందికి వివిధ రకాల సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన జగనన్న సురక్షతో 11 రకాల పత్రాలు ఉచితంగా అందజేస్తారన్నారు. అర్హత ఉండి పథకాలు పొందలేని వారికి ఇదొక మంచి సదవకాశమని చెప్పారు. ప్రజలకు అన్ని రకాల సేవలు నేరుగా అందివ్వాలనే ఉద్దేశంతో సీఎం జగన్ మోహన్‌రెడ్డి అత్యంత ప్రతిష్ఠాత్మకంగా ఈ కార్యక్రమం అమలు చేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో ఈఓపీఆర్‌డీ శ్రీనివాసరావు, ఏపీఓ రత్నమాల, ఏపీఎం పెంటం నాయుడు, ప్రజాప్రతినిధులు వాసుపల్లి అప్పన్న, పడాల శ్రీధర్, తదితరులు పాల్గొన్నారు.

సద్వినియోగం చేసుకోవాలి..

నెల్లిమర్ల రూరల్: జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని నగర పంచాయతీ కమిషనర్ బాలాజీ ప్రసాద్ కోరారు. నగర పంచాయతీ పరిధిలోని ఇందిరానగర్ కాలనీలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రజా సమస్యల పరిష్కారానికి జగనన్న సురక్ష కార్యక్రమం ఉపయోగపడుతుందన్నారు. ప్రభుత్వ సేవల కోసం సంబంధిత వలంటీర్లు, సచివాలయ సిబ్బందిని సంప్రదించాలని సూచించారు. అనంతరం 11 రకాల సర్వీసులకు సంబంధించి మొత్తం 788 ధ్రువపత్రాలను లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో అధికారులు విశ్వేశ్వరరావు, గోవిందరావు, తదితరులు పాల్గొన్నారు.



పూసపాటిరేగ: కుమిలి-2 లో ధ్రువపత్రాలు అందజేస్తున్న ఎంపీడీఓ రామారావు, తదితరులు

ప్రజా సంక్షేమమే లక్ష్యం..

డెంకాడ: ప్రజాసంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పని చేస్తున్నారని డెంకాడ పీఏసీఎస్ అధ్యక్షుడు రొంగలి కనకసింహాచలం అన్నారు. మండలంలోని డెంకాడ, అమకాం గ్రామాల్లో జనగన్న సురక్ష కార్యక్రమాలు నిర్వహించారు. డెంకాడలో జరిగిన కార్యక్రమంలో రొంగలి కనక సింహాచలం మాట్లాడుతూ, జగనన్న సురక్ష ద్వారా 11 రకాల సేవలను ప్రభుత్వం అధికారులు ద్వారా ఉచితంగా అందిస్తోందన్నారు. అనంతరం పలువురు లబ్ధిదారులకు ధ్రువపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ డీడీ స్వరూపారాణి, తహసీల్దార్ పి.ఆదిలక్ష్మి, డెంకాడ, అమకాం సర్పంచ్‌లు పతివాడ గౌరి, బలసా కవిత, ఎంపీటీసీ సభ్యురాలు రాంపిల్లి మహేశ్వరి, అధికారులు, సచివాలయ ఉద్యోగులు, తదితరులు పాల్గొన్నారు.



నెల్లిమర్ల రూరల్: లబ్ధిదారులకు ధ్రువపత్రాలు పంపిణీ చేస్తున్న కమిషనర్ బాలాజీప్రసాద్



డెంకాడ: ధ్రువపత్రాలను అందిస్తున్న పీఏసీఎస్ అధ్యక్షుడు రొంగలి కనకసింహాచలం, తదితరులు

జగనన్న సురక్ష పేదలకు వరం

- వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ సూర్యనారాయణరెడ్డి

భోగాపురం: జగనన్న సురక్ష క్యాక్రమం పేదలకు వరంలాంటిదని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఉప్పాడ సూర్యనారాయణరెడ్డి అన్నారు. మండలంలోని గూడెపువలస, బైరెడ్డిపాలెం సచివాలయాల్లో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ప్రభుత్వం అమలు చేస్తున్న జగనన్న సురక్ష కార్యక్రమం దేశానికే ఆదర్శమన్నారు. ప్రభుత్వం సొమ్ము తినాలంటే ఎంతో రుణం ఉండాలనే నానుడి గతంలో ఉండేదని.. అయితే ప్రస్తుతం ప్రభుత్వ సొమ్ము తినాలంటే ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఉండాలనే పరిస్థితి నెలకొందన్నారు. అనంతరం లబ్ధిదారులకు వివిధ రకాల ధ్రువపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ బైరెడ్డి రాజు, ఎంపీటీసీ సభ్యురాలు రాజుకమల, జేసీఎస్ మండల కన్వీనర్ బైరెడ్డి యర్రప్పలనారాయణ, ఎంపీడీఓ అప్పలనాయుడు, డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాసరావు, ఈఓపీఆర్‌డీ సురేష్, శీరపు గురునాథ్‌రెడ్డి, జేబీ రెడ్డి, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.



లబ్ధిదారులకు ధ్రువపత్రాలు అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఉప్పాడ సూర్యనారాయణరెడ్డి

జగనన్నతోనే ప్రజారంజక పాలన

విజయనగరం రూరల్: నాలుగేళ్లుగా ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రజారంజక పాలన సాగిస్తున్నారని విజయనగరం ఎంపీపీ మామిడి అప్పలనాయుడు అన్నారు. మండలంలోని దుప్పాడ, కోరుకొండ గ్రామాల్లో ఎంపీపీ అప్పలనాయుడు ఆధ్వర్యంలో 'జగనన్న సురక్ష' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కార్యక్రమంలో భాగంగా ప్రజలకు వారి గ్రామాల్లోనే ఉచితంగా 11 రకాల ప్రభుత్వ సేవలు అందించడానికి ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. నాలుగేళ్ల వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో దళారీ వ్యవస్థ, సిఫార్సులు, అవినీతికి తావులేకుండా పోయిందన్నారు. సచివాలయ, వలంటీర్ వ్యవస్థలతో ఇంటింటికీ ప్రభుత్వ సేవలు అందిస్తున్నట్లు చెప్పారు. నిస్వార్థంగా సేవలందిస్తున్న వలంటీర్లపై లేనిపోని ఆరోపణలు చేయడం తగదన్నారు. అనంతరం అర్జీదారులకు ధ్రువపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో ఈఓపీఆర్‌డీ డి.తిరుపతినాయుడు, కరుమజ్జి రామలప్పుడు, కోరుకొండ సర్పంచ్ శంకర్, మాజీ సర్పంచ్ శివాజీ, వార్డు సభ్యులు, మండలశాఖ అధికారులు, పంచాయతీ కార్యదర్శి వెంకటరావు, పార్టీ నాయకులు, సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



దరఖాస్తుదారునికి ధ్రువపత్రం అందిస్తున్న ఎంపీపీ అప్పలనాయుడు, తదితరులు

మూగజీవాలకు మెరుగైన వైద్యసేవలు

- పశుసంవర్థక శాఖ జాయింట్ డైరెక్టర్ విశ్వేశ్వరరావు



సమావేశంలో మాట్లాడుతున్న విశ్వేశ్వరరావు

విజయనగరం ఫోర్ట్: మూగజీవాలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని పశు సంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్ ఎ. విశ్వేశ్వరరావు అన్నారు. గురువారం స్థానిక వీటీ అగ్రహారంలో అధికారులు, సిబ్బందితో డివిజన్ స్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎక్కువ మంది గొర్రెలను పెంచేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. గొర్రెల ఉత్పాదకతను మెరుగు పరచడానికి మంచి పోషకాహారం మూగజీవాలకు అందించాలని, ఈ విషయంలో పెంపకందారులకు అవగాహన కల్పించాలన్నారు. వైఎస్సార్ సంచార పశు వైద్యశాల సేవలపై విస్తృత ప్రచారం చేపట్టాలని సూచించారు. సమావేశంలో డీడీ వై.వి. రమణ, శాస్త్రవేత్త ఇల్ల సతీష్‌కుమార్ పాల్గొన్నారు.

సమతుల ఆహారం తప్పనిసరి



కార్యక్రమంలో మాట్లాడుతున్న కొండమ్మ

విజయనగరం ఫోర్ట్: కౌమారదశలో ఉన్న పిల్లలు సమతుల ఆహారాన్ని తీసుకోవాలని ఆర్‌కేఎస్‌కే కౌన్సిలర్ కొండమ్మ అన్నారు. గురువారం స్థానిక గిరిజన ఆశ్రమ సంక్షేమ పాఠశాలలో కౌమారదశలో వచ్చే మార్పులపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, శారీరక పెరుగుదల పునరుత్పత్తి వ్యవస్థ అభివృద్ధికి సమతుల ఆహారం ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. పప్పు దినుసులు శరీర నిర్మాణానికి, శరీర కణజాల అభివృద్ధికి ఉపయోగపడతాయని తెలిపారు. పిండి పదార్థాలు శక్తిని పెంచుతాయని చెప్పారు. నెయ్యి, గుడ్లు, చేప, మాంసం, పాలు అధిక శక్తిని అందిస్తాయన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

రైతులకు ఉచితంగా చోడి విత్తనాలు

జామి: చోడి పంట సాగును ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని ఏఓ కిరణ్‌కుమార్, ఎంపీడీఓ సతీష్ అన్నారు. మండలంలోని ఆర్.బి.పురంలో రైతులకు గురువారం ఉచితంగా చోడి విత్తనాలు పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఏఓ మాట్లాడుతూ అంతర్జాతీయ చిరుధాన్యాల సంవత్సరాన్ని పురస్కరించుకుని రాగుల సాగును పెంచాలని ప్రభుత్వం నిర్ణయించిందని తెలిపారు. మండలంలో 60 ఎకరాల్లో ఈ పంట సాగుకు సరిపడా విత్తనాలను రైతులకు ఉచితంగా అందిస్తున్నట్లు చెప్పారు. ఎకరానికి 2 నుంచి 2.5 కిలోల విత్తనాలు అందిస్తామని, ఆసక్తి గల రైతులు వ్యవసాయశాఖ సిబ్బందిని సంప్రదించాలని సూచించారు. ఆర్.బి.పురం, గొడికొమ్ము పంచాయతీల కార్యదర్శులు సన్యాసినాయుడు, ప్రసాద్, ఎంపీఈఓ గీత తదితరులు పాల్గొన్నారు.

అన్ని రంగాల్లోనూ మహిళల ప్రతిభ

- సెంచూరియన్ రిజిస్ట్రార్ డాక్టర్ పల్లవి

నెల్లిమర్ల రూరల్: నేటి సమాజంలో మహిళలు అన్ని రంగాల్లోనూ ప్రతిభ కనబరుస్తున్నారని సెంచూరియన్ యూనివర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ పల్లవి అన్నారు. మండలంలోని టెక్కలి సెంచూరియన్ విశ్వ విద్యాలయంలో గురువారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడుతూ, ఏ రంగంలో చూసినా మహిళల పాత్ర కీలకంగా ఉందన్నారు. మహిళ తలుచుకుంటే ఏ రంగంలోనైనా రాణించగలదని చెప్పారు. విద్యార్థినులు విద్యార్థి దశ నుంచే ఆత్మస్థైర్యాన్ని పెంపొందించుకొని ముందుకు సాగాలని సూచించారు. కార్యక్రమంలో డీన్ ప్రొఫెసర్ ఎంఎల్ఎన్ ఆచార్యులు, సిబ్బంది పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న సెంచూరియన్ రిజిస్ట్రార్ డాక్టర్ పల్లవి

జీవన నైపుణ్యాలపై శిక్షణ

నెల్లిమర్ల రూరల్: పట్టణంలోని వేణుగోపాలపురం ప్రభుత్వ డైట్ కళాశాలలో ఉపాధ్యాయులకు జీవన నైపుణ్యాలపై శిక్షణ తరగతులు గురువారం నుంచి ప్రారంభమయ్యాయి. మ్యాజిక్ బస్సు ఫౌండేషన్ జిల్లా కో ఆర్డినేటర్ శ్రీనివాసరావు, రీజనల్ మేనేజర్ అనిల్ కుమార్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులకు పలు సూచనలు, సలహాలు అందజేశారు. జిల్లా విద్యాశాఖాధికారి ఆదేశాల మేరకు మూడు రోజుల పాటు శిక్షణ తరగతులు కొనసాగనున్నాయని వారు తెలిపారు.

ట్రిపుల్ ఐటీకీ విద్యార్థుల ఎంపిక

పూసపాటిరేగ: మండలానికి చెందిన ముగ్గురు విద్యార్థులు ట్రిపుల్ ఐటీకి ఎంపికయ్యారు. కోనాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన అదపాక నవీన్ కుమార్ నూజివీడు ఐఐటీకి.. అదపాక ముకుంద శ్రీకాకుళం ఐఐటీకి.. ఓక్‌ల్యాండ్ పాఠశాలకు చెందిన పిడుగు మోహనరావు నూజివీడు ఐఐటీకి ఎంపికయ్యారు. ఆయా పాఠశాలల విద్యార్థులను ఉపాధ్యాయులు అభినందించారు.

మొయిద నుంచి ఇద్దరు...

నెల్లిమర్ల రూరల్: మండలంలోని మొయిద ఉన్నత పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు ట్రిపుల్ ఐటీకి ఎంపికయ్యారు. పదో తరగతి చదివిన పి. అస్మిత నూజువీడు ట్రిపుల్ ఐటీకి.. ఎస్. ప్రవీణ్ శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీకి ఎంపికయ్యారు. అస్మిత పదో తరగతిలో 575 మార్కులు, ప్రవీణ్ 565 మార్కులు సాధించారు. విద్యార్థులను హెచ్‌ఎమ్ బేతా మహాలక్ష్మి, ఉపాధ్యాయులు అభినందించారు.

మోడల్ స్కూల్ విద్యార్థుల ఎంపిక..

విజయనగరం రూరల్: పట్టణ శివారు అయ్యప్పనగర్‌లోని మోడల్ పాఠశాలకు చెందిన ముగ్గురు విద్యార్థులు ట్రిపుల్ ఐటీకి ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ డాక్టర్ రుక్షానా పర్వీన్ తెలిపారు. పాఠశాల విద్యార్థిని మావూరి మౌనిక నూజివీడు ఐఐఐటీకి.. చింతాడ వాసు, శశికిరణ్‌లు శ్రీకాకుళం ఐఐఐటీకి ఎంపికయ్యారని ఆమె తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది అభినందనలు తెలిపారు.



నెల్లిమర్ల రూరల్: పి. అస్మిత



నెల్లిమర్ల రూరల్: ఎస్. ప్రవీణ్

అన్ని వర్గాల సంక్షేమమే లక్ష్యం



గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో కోలగట్ల శ్రావణి, లయాయాదవ్, తదితరులు

- డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి

విజయనగరం: అన్ని వర్గాల సంక్షేమమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం వినూత్న కార్యక్రమాలు చేపడుతోందని నగర డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి తెలిపారు. సంక్షేమ పథకాల అమలులో ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి నూతన ఒరవడికి శ్రీకారం చుట్టారని చెప్పారు. నగరంలోని 10వ డివిజన్ పరిధి మస్తాన్ వీధి, సుంకర వీధి, తదితర ప్రాంతాల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న డిప్యూటీ మేయర్లు కోలగట్ల శ్రావణి, ముచ్చు లయా యాదవ్‌లకు స్థానికులు ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా వారు ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలను వివరిస్తూ, ప్రభుత్వ పాలనపై ఆరా తీశారు. సమస్యలు అడిగి తెలుసుకుని, వాటిని పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అనంతరం శ్రావణి మాట్లాడుతూ.. అవినీతి, లంచగొండితనం లేని పాలనను ముఖ్యమంత్రి జగనన్న అందిస్తున్నారన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలను అందిస్తూ పారదర్శక పాలన సాగిస్తున్నారన్నారు. ఎమ్మెల్యేగా గెలిచిన దగ్గరనుంచి కోలగట్ల వీరభద్రస్వామి ప్రజా సమస్యలను తెలుసుకుని పరిష్కరించడమే లక్ష్యంగా పని చేస్తున్నారని చెప్పారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని మరోసారి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్‌పర్సన్ నడిపేన శశిభార్గవి, కార్పొరేటర్ ఎస్.పద్మ, మహేష్, స్థానిక నాయకులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పల్లెల్లో 'ఫ్యామిలీ డాక్టర్' సేవలు

బొండపల్లి/ గజపతినగరం రూరల్: మండలంలోని కనిమెరక గ్రామంలో దేవుపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి కె.పద్మావతి, గజపతినగరం మండలంలోని లోగిశ గ్రామం లో మరుపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి అనూజ్ రాయ్ ఆధ్వర్యంలో గురువారం 'ఫ్యామిలీ డాక్టర్' కార్యక్రమం నిర్వహించారు.

నాయకుల నివాళి ..

జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు తండ్రి నర్సింగరావు (87) చికిత్స పొందుతూ గురువారం తెల్లవారుజామున మృతి చెందారు. ఈయన మృతి వార్త తెలుసుకున్న ఉమ్మడి విజయనగరం జిల్లా ప్రజా ప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, మజ్జి శ్రీనివాసరావు అభిమానులు అధిక సంఖ్యలో తరలివచ్చి నర్సింగరావుకు ఘనంగా నివాళులర్పించారు. సాయంత్రం తోటపాలెం స్వర్గధామంలో అంత్యక్రియలు జరిగాయి..





జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావును పరామర్శిస్తున్న ప్రజాప్రతినిధులు



నివాళులర్పిస్తున్న డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర



మజ్జి నర్సింగరావు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మంత్రి బొత్స



పార్థివదేహంపై పూలమాల వేస్తున్న మాజీ ఎంపీ బొత్స ఝాన్సీలక్ష్మి



చివరిమజిలీలో జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, తదితరులు